క్లుప్తంగా

కంప్యూటర్ ఆపరేటర్‌కు సత్కారం


నారాయణరావును సన్మానిస్తున్న తహసీల్దార్ కేవీ మాధవరావు, సిబ్బంది

కిర్లంపూడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ దొడ్డిపట్ల నారాయణరావును అధికారులు సన్మానించారు. ఎంఆర్వో కేవీ మాధవరావు, డిప్యూటీ తహసీల్దార్ మడిక శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు కలిసి నారాయణరావును శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మందేటి గుర్రయ్య, గల్లా రాము, అరుగల్ల నూకరాజు, ఇంద్ర, అరుణరేక పలువురు పాల్గొన్నారు.

స్టీల్ కంచాల పంపిణీ


విద్యార్థులకు కంచాలు అందజేస్తున్న మద్దుకూరి పెద్దబ్బు, ఆరుమిల్లి ఏసుబాబు చౌదరి తదితరులు

తొండంగి: బెండపూడి హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులకు స్టీల్ కంచాలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు వంద మందికి, గ్రామ సర్పంచ్ ఏలేటి దుర్గాదేవి మరో వంద మందికి భోజనం చేసేందుకు స్టీలు కంచాలు బహూకరించగా వాటిని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మద్దుకూరి వీరవెంకటసత్యనారాయణచౌదరి(పెద్దబ్బు) విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏలేటి ధర్మరాజు, గొంతెన నాగేశ్వరరావు, ఎంపీటీసీలు గొంతెన దుర్గ, మళ్ల తేజ, సోమిశెట్టి చలపతి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎ.మల్లవరంలో వార పండగ

రౌతులపూడి: వర్షాల కోసం మంగళవారం ఎ.మల్లవరం గ్రామస్తులు వారపండగ నిర్వహించారు. ప్రజలంతా పవిత్ర స్నానాలు ఆచరించి పవిత్ర జలాలతో కూడిన బిందెలను తెచ్చి గ్రామంలో ఉన్న మావుళ్లమ్మతల్లి, దుర్గమ్మతల్లి అమ్మవారులకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు కురవాలని వేడుకుంటూ మహిళలంతా గ్రామవీధుల్లో తిరిగి రోడ్లపై నీటిని వేసి వార పండగ చేశారు.

పూడిక తీత పనుల ప్రారంభం


సిరిపురంలో పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: తిమ్మరాజుచెరువు ప్రధాన పంటకాలువలో పూడికతీత పనులు మంగళవారం ప్రారంభించారు. మండలంలోని తిమ్మరాజుచెరువు నుంచి లింగంపర్తి, భద్రవరం, పేరవరం, సిరిపురం గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నారు. ఇటీవల పంటకాలువ పూడుకుపోయింది. దీంతో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ తన సొంతఖర్చులతో కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. సిరిపురంలో పనులను సొసైటీ అధ్యక్షుడు చిక్కాల లక్ష్మణరావు, భద్రవరం, సిరిపురం సర్పంచులు కూనపురెడ్డి సుబ్బారావు, పీతల నూకరాజు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మజ్జూరి సూర్యనారాయణ, భేరి అరవిందకుమార్, సోము సూరీడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

గండేపల్లి: విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందినట్టు గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఎన్టీ రాజాపురానికి చెందిన బొందల దుర్గ(37) ఆమె ఇంటి ఎదురుగా ఉన్న జీ వైర్ పై బట్టలు ఆరబెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయింది. బంధువులు ఈమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు.


జగ్గంపేటలో జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


తుని మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీ సుధారాణి


తుని మండల పరిషత్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, అధికారులు


తొండంగిలో జెండాను ఆవిష్కరించిన వైస్ ఎంపీపీ గంగబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ పద్మలత తదితరులు


రౌతులపూడిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి

మది నిండా.. జాతీయ జెండా

- రెపరెపలాడిన త్రివర్ణ పతాకం
- గ్రామగ్రామాన జెండావిష్కరణ
- ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

ఏలేశ్వరం: భారతదేశ స్వాతంత్య్ర దినోత్సవాన్ని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామగ్రామాన త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాలు, సేవా సంస్థల్లో జాతీయపతాకాన్ని ఎగురవేశారు. దీంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. దేశానికి స్వాతంత్య్రాన్ని సాధించిన మహనీయుల చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయం, ఎంఈఓ కార్యాలయాల వద్ద ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ కేఏ కొండలరావు ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, దోశీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక చిలుకూరి చిట్స్‌ఫైనాన్స్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఉమ్మిడి వెంకట్రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయజెండా ఎగురవేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

శంఖవరం: స్థానిక జెడ్పీ హైస్కూల్, పీహెచ్‌సీ, ఎండీఓ, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, కేజీబీవీలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, ఎంపీడీఓ జి.శివ రామకృష్ణ పాల్గొన్నారు.

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీ వైస్‌చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్ జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించి ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణంతో కలసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు డీటీ సత్యనారాయణ జెండాను ఎగరవేశారు.


కిర్లంపూడిలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, నాయకులు

తుని: స్థానిక పురపాలక సంఘంలో చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. జాతిపతి మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. వ్యవసాయ మార్కెట్‌లో చైర్మన్ మాకినీడి బాబు, గాంధీసత్రంలో చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, అమ్మాజీపేటలో వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ పాఠశాలలో వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. తహసీల్దార్, తుని పట్టణ పోలీస్‌స్టేషన్, సబ్ రిజిస్ట్రార్, గృహ నిర్మాణ, రాజా ఉన్నత పాఠశాల, మహిళా జూనియర్ కళాశాల, ఇందిరాసాగర్ కార్యాలయం, పెన్షనర్ల అసోసియేషన్, ఐసీడీఎస్, బీసీ ఐక్యవేదిక, విద్యుత్ శాఖల కార్యాలయాల్లో జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. భారతీయ జనతా పార్టీ, టీడీపీ, కాంగ్రెస్, స్వచ్ఛంద సంస్థల్లో పంద్రా ఆగస్టు వేడుకలను జరుపుకొన్నారు. తుని రెడ్ క్రాస్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర వేడుకులు జరిగాయి. మున్సిపల్ వైస్‌చైర్మన్ పామర్తి మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు,పలువురు కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. శ్రీప్రకాష్‌లో జరిగిన వేడుకల్లో తుని పట్టణ సీఐ. ఎం.గీతా రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు వివిధ వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ లగుడు శ్రీనివాసు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు. అనంతరం మువ్వన్నెల జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేసారు. కోపరేటివ్ సొసైటీలో అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జగదీష్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శిని జాతీయ జెండాను ఎగుర వేశారు. అల్లిపూడి కేజీబీవీలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, ఎస్ఓ రాజేశ్వరి జాతీయ జెండాను ఆవిష్కరించారు.


ఏలేశ్వరంలో జాతీయజెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

తుని రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి, లోవ దేవస్థానంలో ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు, రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జె.విజయబాబు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి, వందనం చేశారు. మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వి.కొత్తూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు సాంప్రదాయ గిరిజన నృత్యాలను ప్రదర్శించారు.

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యాశాఖ, మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద ఎంపీపీ సుధాకర్, స్థానిక సచివాలయాలు, ప్రభుత్వ వసతి గృహాల వద్ద సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, స్థానిక కోర్టు వద్ద న్యాయమూర్తి కాటం భాను, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, పోలీస్ స్టేషన్ వద్ద సీఐ కె.కిషోర్‌బాబు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఎస్ఈబీ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, వివిధ పార్టీల నాయకులు పార్టీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు.

గోకవరం: స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, గుల్లా ఏడుకొండలు, వరసాల ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గాజింగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, తహసీల్దార్ కార్యాలయంలో సుగుణ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై యువి శివనాగబాబులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో రామరాయ కళావేదిక వద్ద, సత్యదేవుని చిత్రపటం వద్ద జాతీయ పతాకానికి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత జాతీయపతాకాన్ని దేవస్థానం ఈఓ ఎగురవేసి వందన సమర్పణ చేశారు. దేవస్థానంలోని స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) సిబ్బంది జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు.

కిర్లంపూడి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక నాయకులు, విద్యార్థులతో కలిసి త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం చేశారు. స్థానిక జగనన్న క్రాంతి పథం కార్యాలయం, వీరవరం ప్రభుత్వ ఆసుపత్రి, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, గ్రామ పంచాయతీల్లో జెండాను ఆవిష్కరించారు.

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం, వ్యవసాయ మార్కెట్ కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు జెండా ఎగరవేశారు.

గండేపల్లి: స్థానిక ఎంఈఓ, ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకలకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్‌ఎంపీపీ కుంచె రాజా, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, గండేపల్లి సొసైటీ అధ్యక్షుడు కేతిన బాబి, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, సూరంపాలెం సచివాలయ కన్వీనర్ పోస్ని బాబూరావు, తహసీల్దార్ వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మురారిలో ఉప సర్పంచ్ జాస్తి వసంత్, నీలాద్రిరావుపేటలో సర్పంచ్ ములంపాక సురేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలోను సిబ్బంది ఆధ్వర్యంలో జెండా వందనం నిర్వహించారు.


శంఖవరం పీహెచ్‌సీలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

వంద మీటర్ల త్రివర్ణ పతాకంతో ర్యాలీ


జాతీయపతాకంతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అన్నవరం: వేడుకల్లో భాగంగా విద్యార్థులు, పుర ప్రముఖులు వంద మీటర్లు పొడవు గల జాతీయ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతకి జై అంటూ నినాదాలు చేస్తూ స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని శారదా స్కూల్ నుంచి జూనియర్ కళాశాల మైదానం వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ శెట్టిబత్తుల కుమారరాజా, వైస్ ప్రెసిడెంట్ బొబ్బిలి వెంకన్నబాబు, ఆర్యవైశ్య వర్తక సంఘం, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కోటనందూరు హైస్కూల్లో జాతీయజెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు


రత్నగిరిపై జెండా వందనం చేస్తున్న దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్


గోకవరంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు


ఒమ్మంగిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం


ప్రత్తిపాడులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కాంతి సుధాకర్

రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

శంఖవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగనన్న భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు భూ హక్కుల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న భూసర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. దీనివల్ల ఏళ్ల తరబడి ఉన్న భూ వివాదాలు పరిష్కారమవుతున్నాయన్నారు. వందేళ్ల తర్వాత ఈ సర్వే జరుగుతోందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు భూ హక్కు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, జెడ్పీటీసీ తరుం రాజేశ్వరి, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ జి.శివరామకృష్ణ, వీఆర్వోలు, సర్వేర్లు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

డీఆర్ఎఫ్ క్రికెట్ టోర్నీ విజేత యల్లయ్యపేట

తుని: యువతలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా క్రికెట్, వాలీబాల్ పోటీలను నిర్వహించడం స్ఫూర్తి దాయకమని మంత్రి తనయుడు దాడిశెట్టి శంకర్ మల్లిక్ అన్నారు. మంగళవారం పంద్రా ఆగష్టును పరష్కరించుకొని తుని నియోజకవర్గ స్థాయి డీఆర్ఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ నిర్వహించారు. దివంగత మహానేత వైఎస్‌రాజశేఖరరెడ్డి జయంతిని పురష్కరించుకొని క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా వర్షాలు ఇతర కారణాల వలన జాప్యం జరిగింది. మంగళవారం తొండంగి మండలం యల్లయ్యపేట, తుని టౌన్ మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. తొలిత బ్యాటింగ్ చేసిన యల్లయ్యపేట జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. తుని టౌన్ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. యల్లయ్యపేట జట్టు 4 పరుగుల తేడాతో విజయం సాధించి డీఆర్ఎఫ్ కప్‌ను గెలుచుకుంది. విజేతలకు మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్ విజేతకు రూ.లక్ష నగదు ట్రోఫీ, రన్నర్స్‌కు రూ.50 వేలు నగదు, ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మల్లిక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువతను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, వైస్.ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి రాజా తనయుడు శంకర్ మల్లిక్

సర్టిఫికెట్ల అందజేత

తుని రూరల్: పండ్ల జాతుల్లో మేలురకాల మొక్కలను ఉత్పత్తి చేసేందుకు అంటుకట్టడంలో మెళకువలు పాటించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు అన్నారు. కాకినాడ ఐడియల్ కళాశాలకు చెందిన విద్యార్థులకు 45 రోజులు పాటు తేటగుంటలోని వైఎస్సార్ నర్సరీలో యజమాని మోర్త చిన్నారావు అంటుకట్టు పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. శిక్షణపూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం చైర్మన్ సర్టిఫికెట్లను అందజేశారు. సర్పంచ్ అత్తి నాగరాజు, కళాశాల హెచ్ఓడీ సురేంద్రసాగర్, మాదిగ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అరుగుల మోషే తదితరులు పాల్గొన్నారు.

బ్రాందీ సీసాలతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) పరిధిలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం సీసాలు ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 16 బ్రాందీ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ కథనం మేరకు కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో గస్తీ నిర్వహించగా సుంకర కృష్ణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి 10 బ్రాందీ సీసాలను, ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో ధర్మంపాడి వీరబ్రహ్మంను అరెస్టు చేసి, అతని నుంచి ఆరు బ్రాందీ సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి సీఐ తెలిపారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

తొండంగి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పెరుమాళ్లపురం కెనరా బ్యాంకు విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేసింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా కెనరా బ్యాంకు విద్యాజ్యోతి పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న పేద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 9, 8, 7, 6, 5 తరగతుల విద్యార్థులకు ఉపకారవేతనాలు మంజూరు చేసింది. ఈ మేరకు గడ్డిపేట జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని వై.శ్రీవల్లి, ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎ.జ్యోతిలకు రూ.5 వేలు చొప్పున బ్యాంకు మేనేజర్ మధు అందజేశారు. వాకదారిపేట కేజీబీవీ విద్యార్థులు దివ్య శరణ్య(ఏడో తరగతి), లక్ష్మి ప్రియ(ఆరో తరగతి విద్యార్థులకు రూ.2500 చొప్పున ఉపకార వేతనం అందజేశారు. కార్యక్రమంలో పెరుమాళ్లపురం సర్పంచ్ యాదాల ఉమారేవతి, ఎంపీటీసీలు బద్ది నూకరాజు, యాదాల రమణ, యాదాల కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు,కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్స్‌ఫెలోషిప్ ఆధ్వర్యంలో

మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ బుచ్చియ్యపేట గ్రామంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగంగబాబు, జెడ్పీవైస్.చైర్మన్ మేరుగు పద్మలత, సర్పంచ్ యాదాల ఉమారేవతి, తదితర ప్రజా ప్రతినిధులు, పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు వై.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.


పెరుమాళ్లపురంలో విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేసిన దృశ్యం

ఉద్యోగులకు పురస్కారాలు



మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గోకవరం ఏపీఓ అప్పలరాజు, ఆరోగ్య శ్రీ టీం లీడర్ నరేష్

తుని: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వారికి స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేశారు. మంగళవారం కాకినాడలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురష్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సిదిరి అప్పలరాజు, కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా పలువురు ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. తుని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావుకు ఉత్తమ సేవా పురష్కారం అందజేశారు. సన్యాసిరావు అందుకున్నారు. ఇటీవల తుని మండలం ఎర్రకోనేరు దగ్గర జరిగిన హత్య కేసును చేధించినందుకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అవార్డు అందుకున్న సన్యాసిరావును పలువురు అభినందించారు.

ఏలేశ్వరం: పట్టణంలోని 7వ సచివాలయ పరిధిలోని వీఆర్వో అవసరాల కిషోర్, నగర పంచాయతీ కార్యాలయంలో మేనేజర్ కె.శ్రీనివాసరావు, స్థానిక సీహెచ్‌సీలో ఆర్థోపెడిక్ వైద్యుడు భావతేజ ఉత్తమ అవార్డు అందుకున్నారు.

ప్రత్తిపాడు: ఉత్తమ సేవలు కనబరచిన ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కెం బాలచంద్ర యోగీశ్వర్ అవార్డు అందుకున్నారు.

కిర్లంపూడి: వ్యవసాయ శాఖలో మండల వీపీఏగా రైతులకు సకాలంలో సేవలందించిన ఆకుల సురేష్ ఉత్తమ గ్రామ వ్యవసాయ సహాయకుల పురస్కారం దక్కింది.

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఇ.చంద్రనాయుడుకు ఉత్తమ అవార్డు లభించింది.

గోకవరం: గోకవరం ఏపీఓ, కొవ్వూరు ఇన్‌చార్జి ఏపీడీ పి.శేషఅప్పలరాజు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు.

గండేపల్లి: జగ్గంపేటకు చెందిన నరేష్‌కు ఉత్తమ ఆరోగ్యశ్రీ టీం లీడర్ పురస్కారం లభించింది.








కాకినాడలో మంత్రి అప్పలరాజు, కలెక్టర్ కృతిక శుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న సీఐ సన్యాసిరావు, వీఆర్వో అవసరాల కిషోర్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్థోపెడిక్ వైద్యుడు భావతేజ, అసిస్టెంట్ డైరెక్టర్ చిక్కెం బాలచంద్ర యోగీశ్వర్, వీఏఏ ఆకుల సురేష్, ప్రిన్సిపాల్ చంద్రనాయుడు


సూదికొండ అటవీశాఖ కార్యాలయంలో పురస్కారాలు అందుకున్న సిబ్బందిని అభినందిస్తున్న రేంజర్ కరుణాకర్